సాక్షి ప్రకాశం

మంగళవారం । 2 । జూలై । 2024



కనిగిరిలో ఉద్రిక్తత

కనిగిరిలో అధికార జులుంపై వీధివ్యాపారులు తిరగబడ్డారు. ఫుట్‌పాత్‌లపై ఉండే దుకాణాలను తొలగించడాన్ని నిరసిస్తూ ఆందోళన చేశారు. - 8లో..



వృద్ధురాలి దారుణ హత్య

ఓ వృద్ధురాలు దారుణ హత్యకు గురైన సంఘటన మార్కాపురం మండలం వేములకోటలో జరిగింది. అల్లుడే హతమార్చాడని పోలీసులు అనుమానిస్తున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
32.5/21

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

ఇంటి గడప నుంచి..
నడిరోడ్డుపైకి..

అయ్యా ...అంతకు ముందు ఇచ్చినట్లే వలంటీర్ల చేత పింఛన్ ఇస్తే బాగుంటుంది కదా. ఈ గందరగోళం ఎందుకు.. ఒక అవ్వ సందేహం.

సార్... ఇంటి దగ్గరకు వచ్చి పింఛన్ ఇస్తారేమో అని ఉదయం నుంచి ఎదురు చూశాను. ఇక లాభం లేదనుకొని వెదుక్కుంటూ వచ్చాను. ఇన్ని కష్టాలు ఎందుకండి. వలంటీర్ల చేతికి ఇస్తే వారే వచ్చి ఇచ్చి పోతారుకదా.. ఒక తాత సలహా.

రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీ తొలి రోజే లబ్ధిదారులకు చుక్కలు చూపించింది. సిబ్బంది ఇంటి దగ్గరకు పెన్షన్ తెచ్చిస్తారని చెప్పినా.. చాలా చోట్ల సిబ్బంది ఉన్నచోటకే లబ్ధిదారులు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- ఇంటి వద్ద పింఛన్లు ఇవ్వలేకపోయిన ఉద్యోగులు
- తెల్లవారుజాము నుంచి ఎదురుచూసిన లబ్ధిదారులు
- సచివాలయాలు, గుళ్లు, రచ్చబండల వద్ద పింఛన్ల పంపిణీ
- గంటల తరబడి ఎదురుచూపులు
- వలంటీర్లను గుర్తు చేసుకున్న లబ్ధిదారులు



మర్రిపూడి రామాలయం వద్ద పింఛన్లు పంపిణీ చేస్తుండటంతో వాటి కోసం వచ్చి పడిగాపులు కాస్తున్న వృద్ధులు

ఒంగోలు టౌన్: వలంటీర్లను పక్కన పెట్టిన కూటమి ప్రభుత్వం గతంలో ఇచ్చినట్లే ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తుందని చెప్పింది. ఆర్భాటంగా ప్రచారం చేసింది. తీరా పంపిణీ దగ్గరకు వచ్చేసరికి బోర్లాపడిందన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. సోమవారం తెలవారుజాము నుంచే పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంటుందని చెప్పి అధికారులను ఆదివారం రాత్రి సచివాలయంలోనే నిద్రపోవాలని ఆదేశాలు జారీ చేసింది. తెల్లవారుజాము నుంచే అధికార పార్టీ నాయకులు సైతం వచ్చేశారు. అయితే పింఛన్లు పంపిణీ చేయడంలో ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. లబ్ధిదారుల జాబితా చేతిలో లేక కొందరు, ఇళ్ల వివరాలు తెలియక కొందరు అధికారులు దిక్కులు చూస్తూ నిలబడ్డారు. సర్వర్ పనిచేయడం లేదంటూ లబ్ధిదారులను ఒకచోటుకు పిలిపించుకొని పంపిణీ చేయడం చూసి లబ్ధిదారులు ముక్కున వేలేసుకున్నారు. ఆ మాత్రం దానికి వలంటీర్లను తీసేయడం ఎందుకు...పింఛన్లు పంపిణీ చేయడానికి ప్రజలను ఇబ్బందులు పెట్టడం ఎందుకు అంటూ గొణుక్కోవడం కనిపించింది.

2.92 లక్షల మంది లబ్ధిదారులకు...

జిల్లాలో మొత్తం 2.92 మంది లబ్ధిదారులు ఉన్నారు. 11 కేటగిరీలకు సంబంధించి వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, చేనేత కార్మికులు, ఒంటరి మహిళలు, ట్రాన్స్ జెండర్, హెచ్ఐవీ బాధితులు, డప్పుకళాకారులు, కళాకారులు, మత్స్యకారులు, కల్లుగీత కార్మికులకు గత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం నెలకు రూ.3 వేల పింఛన్ పంపిణీ చేసింది. వీరితో పాటుగా దివ్యాంగులు, లెప్రసీ నూరుశాతం వికలాంగులు (మంచం మీద ఉన్న వారు, వీల్ చైర్‌కు పరిమితం అయిన వారు), కిడ్నీ వ్యాధిగ్రస్తులు, థలసేమియా బాధితులతో పాటుగా అభయ హస్తం, అమరావతి భూమిలేని పేదలు, సైనిక సంక్షేమం, సీవియర్ హిమోఫీలియా, డయాలసిస్ రోగులకు ఇంటి వద్దనే పింఛన్లను అందజేసేది. ఈ పింఛన్ల పంపిణీ కోసం వలంటీర్ల సేవలను ఉపయోగించుకున్నారు. ప్రతి నెలా తెల్లవారుజామునే లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టి, కుటుంబ సభ్యుల మాదిరిగా కుశల సమాచారాలను తెలుసుకుంటూ పింఛన్లు ఇచ్చేవారు. కొంత మంది లబ్ధిదారులు అప్పటికి నిద్ర కూడా లేచేవారు కాదు. అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటున్న వారికి, వ్యక్తిగత పనుల నిమిత్తం ఇతర గ్రామాలకు వెళ్లి ఇబ్బందుల్లో ఉన్న వారికి సైతం కూడా ఎన్నో వ్యయప్రయాసలకోర్చి స్వయంగా వెళ్లి పింఛన్లు అందచేసిన సందర్భాలు ఉన్నాయి.

అందుకే వలంటీర్లు అంటే అవ్వాతాతలు, అక్కా చెల్లెలు, దివ్యాంగ సోదరులు ఎంత గౌరవించేవారు. ఒక్క నయా పైసా తీసుకోకుండా తమకు సేవలు చేస్తున్న వలంటీర్లను కన్నబిడ్డల్లా, తోబుట్టువుల్లా చూసుకున్నారు. అయితే ఇప్పుడు ప్రభుత్వం మారింది. వలంటీర్ల పట్ల లేనిపోని భేషజాలకు పోతున్న ప్రస్తుత పాలకులు పింఛన్ల పంపిణీలో వారిని దూరంగా పెట్టి సచివాలయ ఉద్యోగులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల చేత చేయించేందుకు ప్రయత్నించి పూర్తిస్థాయిలో సఫలం కాలేకపోయిందన్న ప్రచారం జరుగుతోంది.

తొలిరోజు 94.68 శాతం పంపిణీ:

జిల్లాలో 2,91,524 మంది లబ్ధిదారులు ఉండగా 2,76,028 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. మొత్తం 28 కేటగిరీలకు గాను పెంచిన పింఛన్‌లతో కలిపి రూ.199,07,76,000 గాను రూ.188,56,73,500 పంపిణీ చేశారు. జిల్లాలోని సచివాలయ ఉద్యోగులతో పాటుగా మండల స్థాయిలోని అన్నీ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు 5602 మంది పింఛన్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9.30 వరకు పంపిణీ జరుగుతుంది.



ఒంగోలు నగరంలోని వడ్డెవానికుంటలో పింఛన్ల కోసం వేచి ఉన్న మహిళలు



ఒంగోలు శివప్రసాద్‌కాలనీ వార్డు సచివాలయం వద్ద పింఛన్ కోసం వేచి ఉన్న వృద్ధులు

సర్వర్లు మొరాయించడంతో ఇబ్బందులు

జిల్లాలో పింఛన్ల పంపిణీ సందర్భంగా కొన్ని చోట్ల సర్వర్లు మొరాయించాయి. సర్వర్లు మొరాయించడంతో 2 నుంచి 3 గంటల పాటు పింఛన్ల పంపిణీ ఆగిపోయింది. దీంతో లబ్ధిదారులు తీవ్ర అసహనానికి గురయ్యారు. దర్శి మండలంలో అనేక గ్రామాల్లో సర్వర్లు మొరాయించడంతో లబ్ధిదారులు ఇక్కట్లు పడ్డారు. దీంతో పంపిణీ కార్యక్రమం ఆగిపోతుందేమోనని కొందరు ఆందోళన చెందారు. అయితే అధికారులు రెండు మూడు గంటల్లో తిరిగి పంపిణీ ప్రారంభించడంతో ఊపిరి పీల్చుకున్నారు. పెంచిన పింఛన్ల తాలుకా మూడు నెలల బకాయిలను కూడా కలిపి ఇస్తామని చెప్పడంతో దివ్యాంగులు పెంచిన సొమ్ముతో కలుపుకొని రూ.9 వేల దాకా వస్తుందని అనుకున్నారు. అయితే వారికి పెంచిన పింఛన్ మాత్రమే ఇవ్వడంతో కొంత అసంతృప్తికి గురయ్యారు.

- సింగరాయకొండ మండలంలో నామ మాత్రంగా ఇంటి వద్ద పింఛన్లు అందజేశారు. మండలంలోని అనేక గ్రామాల్లో ఎక్కువగా ఆయా గ్రామాల్లోని రచ్చబండ దగ్గరకు లబ్ధిదారులను పిలిపించుకొని పంపిణీ చేశారు. వలంటీర్ల తరహాలో ఇంటింటికీ తిరిగి ఇవ్వకుండా ప్రభుత్వ ఉద్యోగులు గ్రామంలోని ఏదో ఒక సెంటర్లో కూర్చొని పింఛన్ ఇవ్వడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. అయితే లబ్ధిదారుల ఇళ్లు తెలియకపోవడం వలన ఒకచోట కూర్చొని పింఛన్లు ఇస్తున్నామని కొందరు సచివాలయ ఉద్యోగులు చెప్పడం గమనార్హం.
- మర్రిపూడి మండలంలో కూడా ఇంటింటికీ తిరిగి పింఛన్లు ఇవ్వకుండా గ్రామంలోని గుడులు, బడుల వద్ద పంపిణీ చేశారు. గ్రామంలోని లబ్ధిదారులందరికీ ఒకే చోట పింఛన్లు ఇవ్వడంతో క్యూలో నిల్చోలేక వృద్ధులు, వితంతులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు విసుగుచెందారు. గంటల తరబడి పడిగాపులు కాయాల్సి రావడంతో పాత పద్ధతిలోనే వలంటీర్ల చేత పింఛన్లు పంపిణీ చేస్తే బాగుంటుందని చెప్పుకుంటున్నారు.
- గిద్దలూరు మండలంలో కూడా ఇదే తరహాలో పింఛన్ల పంపిణీ జరిగింది. లబ్ధిదారులను ఒకచోటికి పిలిపించుకొని పింఛన్లు పంపిణీ చేశారు. అయితే అనేక గ్రామాల్లో ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, జెడ్పీటీసీలకు ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వకుండా పింఛన్లు పంపిణీ చేయడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

న్యూస్‌రీల్

12 మందికి రికార్డు సహాయకులుగా పదోన్నతి



పదోన్నతి పొందిన వారికి పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు సిటీ: జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్యం పరిధిలోని వివిధ కార్యాలయాల్లో పనిచేస్తున్న 12 మంది ఆఫీస్ సబార్డినేట్‌లకు రికార్డు సహాయకులుగా పదోన్నతి కల్పించి పదోన్నతి ఉత్తర్వులను జెడ్పీ చైర్మపర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సోమవారం అందజేశారు. పదోన్నతి పొందిన 12 మంది రికార్డు సహాయకులు ఎం.రత్నకుమారి, జి.భానుప్రసాద్, యు.సునీత, పి.సౌజన్య, ఎం.శిరోమణి, పి.శాంసన్, వి.సాయికుమార్, కె.యక్రూన్, ఎస్.వెంకటజ్యోతి, ఎం.శరత్‌చంద్రకుమార్, ఎస్.శాంతకుమారి, కె.మరియమ్మలు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపముఖ్య కార్యనిర్వహణాధికారి సి.హనుమంతరావు, పరిపాలనాధికారి వాకా శ్రీనివాసరెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.3.45 లక్షల విలువైన విత్తనాలు సీజ్



తనిఖీలు నిర్వహిస్తున్న రామ్మోహన్, బాలాజీ నాయక్

మార్కాపురం: నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మిన వ్యాపారులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఏఎస్ రామ్మోహన్, మార్కాపురం వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏడీ బాలాజీనాయక్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని గాయత్రి ట్రేడర్స్‌లో తనిఖీలు చేయగా అమ్మకాలకు సంబంధించి సరైన అనుమతి పత్రాలు లేకపోవడంతో రూ.3.16 లక్షల విలువైన విత్తనాల అమ్మకాలను, హరి దుకాణంలోని రూ.29,750 విలువచేసే విత్తనాల అమ్మకాలను నిలిపివేశామని వారు తెలిపారు. విత్తన, పురుగుమందుల దుకాణాల యజమానులు ఎప్పటికప్పుడు వారి వద్ద ఉన్న ఎరువులు విత్తనాల వివరాల ధరలు చూపించే, స్టాక్ బోర్డు నిర్వహణ సక్రమంగా ఉంచాలని అన్నారు. ప్రతి అమ్మకానికి కొనుగోలుచేసే రైతుకు రసీదులు ఇవ్వాలని చెప్పారు. ఈ తనిఖీల్లో మార్కాపురం ఏట దేవిరెడ్డి శ్రీనివాసులు, బీటిఎం సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీ మార్కుల జాబితాలు వెబ్‌సైట్‌లో

ఒంగోలు: ఇటీవల విడుదలైన ఎస్ఎస్‌సీ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలకు సంబంధించి మినీ మార్కుల జాబితాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కుల జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా ఈనెల 6వ తేదీలోగా డైరెక్టర్, ప్రభుత్వ పరీక్షల విభాగం, ఏపీ, విజయవాడ వారికి నేరుగా పంపాలన్నారు.

వెలిగొండ ప్రాజెక్టు ప్రజలకు అందుబాటులోకి రావాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



వెలిగొండ ప్రాజెక్టుపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: వెలిగొండ ప్రాజెక్టు ప్రయోజనాలు ప్రజలకు అందుబాటులోకి రావాలని అందుకు అవసరమైన చర్యలు వేగంగా తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు స్థితిగతులు, బడ్జెట్ కేటయింపు, పునరావాసం తదితర అంశాలపై సోమవారం ప్రకాశం భవనంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు పెండింగ్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చూడాలన్నారు. అందుకు సంబంధించిన బడ్జెట్ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. తక్కువ బడ్జెట్‌తో త్వరగా పూర్తయ్యే పనులు ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని సూచించారు. సమావేశంలో ప్రాజెక్టు ఎస్ఈ అబూత్ అలీమ్, ఇరిగేషన్ ఎస్ఈ మురళీమోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

మాట తప్పిన బాబు

- ప్రభుత్వ కార్యక్రమమా? టీడీపీ కార్యక్రమమా?
- పింఛన్ల పంపిణీపై యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

సింగరాయకొండ: టీడీపీ కూటమి ఎట్టకేలకు నెలరోజుల తరువాత ఒక పథకాన్ని ప్రజలకు అందించటం ఆహ్వానించదగ్గ పరిణామం కానీ ఈ పథకం అమలు తీరును ప్రజలు గమనించాల్సి ఉందని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక ఆర్‌టీసీ బస్టాండ్ వద్ద సోమవారం బ్యాటరీ షాపు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న తాటిపర్తి విలేకరులతో మాట్లాడారు. తాటిపర్తి మాట్లాడుతూ చంద్రబాబు కూటమి ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ కూటమి కార్యక్రమంగా మార్చారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే, సర్పంచ్‌కు సమాచారం లేకుండా గ్రామాల్లో తన పార్టీ నాయకులు, కార్యకర్తల చేత పింఛన్ల పంపిణీ చేయడం బాధాకరమన్నారు. కేవలం ఒక్క పథకానికి నెల రోజుల సమయం తీసుకుంటే జగన్‌మోహన్‌రెడ్డి అందించిన 130 పథకాలను అమలు చేయటానికి 130 నెలలు కావాలా అని ప్రశ్నించారు. పింఛన్ల విషయంలో చంద్రబాబు మాట తప్పారని ఆరోపించారు. 50 సంవత్సరాలు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ లకు పింఛన్ ఇస్తానని ఇవ్వలేదన్నారు. ఎన్నికల కోడ్ రావటంతో మూడు నెలలుగా ప్రజలకు అందించాల్సిన చాలా పథకాలు అందలేదన్నారు. మూడు సిలిండర్లు, అమ్మ ఒడి, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల గురించి ఇంతవరకు ఊసే లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాయకుడికి, ఏ వ్యక్తికి సంబంధం లేకుండా అవినీతి రహితంగా ప్రభుత్వ పథకాలను గ్రామ వలంటీర్ ద్వారా అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. కానీ మొట్టమొదటి పథకం ద్వారానే టీడీపీ కూటమి ప్రభుత్వం తన పక్షపాత ధోరణిని ప్రదర్శించిందని ఆరోపించారు. గతంలో 2019 కి ముందు జన్మభూమి కమిటీలతో ఇష్టం వచ్చినట్లు పథకాలను తన అనుయాయులకే ఇచ్చినందుకు ప్రజలు దిమ్మతిరిగేటట్లు బుద్ధి చెప్పారని, కానీ ప్రజలు మళ్లీ మీకు అధికారం ఇస్తే అదే తప్పు మళ్లీ చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ కార్యక్రమాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా అమలు చేయాలి తప్ప పార్టీ కార్యక్రమంగా చేయరాదన్నారు. ఈ రోజు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకుని వచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ ఉండబట్టి ఆ వ్యవస్థకు అనుసంధానంగా ఉన్న 2.65 లక్షల వలంటీర్లను ధైర్యంగా ప్రక్కన బెట్టి సచివాలయ సిబ్బంది చేత పింఛన్లు పంపిణీ చేయగలిగారని గుర్తు చేశారు. గ్రామ వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేయటానికి కంకణం కట్టుకున్నారని, వారికి జీతం రూ.10 వేలు ఇస్తానని హామీ ఇచ్చి ఈరోజు మాటతప్పే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న తాటిపర్తి

ప్రత్యేక హోదా కోసం కేంద్రాన్ని నిలదీయండి:

కేంద్ర ప్రభుత్వంలోని ఎన్‌డీఏ కూటమిలో ప్రధాన భాగస్వామిగా ఉన్నప్పటికీ ఆర్థికంగా బలోపేతంగా ఉన్న బీహార్ రాష్ట్రం ప్రత్యేక హోదా కావాలని మోదీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారని గుర్తు చేశారు. ప్రత్యేక హోదా లాంటి సంజీవనిని తెచ్చుకుంటే తప్ప అప్పుల ఊబి నుంచి బయటపడే పరిస్థితి లేదన్నారు. ప్రత్యేక హోదా వలన ప్రత్యేక నిధులు, ప్రత్యేక రాయితీల కంపెనీలు వస్తాయన్నారు. విశాఖ ఉక్కు, విశాఖ రైల్వే జోన్, అమరావతి నిర్మాణానికి నిధులు, పోలవరం పూర్తి చేయటానికి నిధులు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నిధులు వంటి వాటిపై దృష్టి పెట్టాలి తప్ప వైఎస్సార్‌సీపీ నాయకులను కొడుతూ, విగ్రహాలను ధ్వంసం చేస్తూ, అల్లర్లకు పాల్పడుతున్న వ్యక్తులను రక్షిస్తూ పక్షపాత పరిపాలనను మానుకోవాలని హితవు పలికారు.

పెండింగ్‌లో ప్రభుత్వ పథకాలు

అనేక ప్రభుత్వ పథకాలను చంద్రబాబు ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టి ప్రజల దృష్టిని మరల్చడానికి వైఎస్సార్‌సీపీ ఆఫీసులపై, రిషికొండ, పోలవరం అని హడావుడి చేయటాన్ని మానుకోవాలన్నారు. ముఖ్యంగా మత్స్యకార భరోసా, అమ్మ ఒడి తో పాటు పెండింగ్ ఉన్న పథకాలను ప్రజలకు అందించాలని కోరారు. అలాగే సంపద సృష్టిస్తానని అధికారంలోకి వచ్చారని సంపద ఎలా సృష్టిస్తారో ప్రజలకు చెప్పాల్సి ఉందన్నారు. కానీ మీరు అప్పుల ద్వారానే పరిపాలన చేస్తారని ప్రజలకు సంకేతాలు వెళ్లాయని ఒక్క నెలరోజుల్లోనే రూ.7 వేల కోట్ల అప్పు చేస్తే 60 నెలల్లో ఎన్ని కోట్ల రూపాయల అప్పు చేస్తారోనని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డలకు ఇస్తానన్న నెలకు రూ.1,500, ఉచిత బస్సు సౌకర్యం, మూడు సిలిండర్ల పథకం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ అంటూ 50 వేల ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉంటే కేవలం 10 వేల ఉద్యోగాలు ఇచ్చి 16 వేల ఉద్యోగాలు అంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత చూపించి అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించాలని కోరారు. షేక్ లియాఖత్, షేక్‌పటేల్, చాన్‌బాషా, పాల్గొన్నారు.

అతిసారపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



అతిసార వ్యాధిపై అవగాహన గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: అతిసార వ్యాధిపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారును ఆదేశించారు. సోమవారం స్పందన భవనంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అతిసార వ్యాధి నివారిద్దాం కార్యక్రమానికి సంబంధించి గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా అతిసార ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వ్యాధి నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను పంపిణీ చేస్తారన్నారు. ఓఆర్ఎస్ ద్రావణం తయారు చేసే విధానాన్ని ఆషా, ఏఎన్ఎంలు తెలియచేస్తారన్నారు. అతిసార వ్యాధి లక్షణాలపై ప్రజలంతా అవగాహనతో ఉండాలన్నారు. అతిసారపై సందేహాలు, సమాచారం కోసం 95154 324799 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. అతిసార నివారణకు మున్సిపాలిటీ, పంచాయతీ, గ్రామీణ నీటి సరఫరా, మాతా శిశు అభివృద్ధి శాఖ, మెప్మా శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. దీనిలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ సురేష్, డీఐఓ పద్మజ ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించం

- గ్రీవెన్స్ నిర్వహించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారంలో అర్జీదారులకు మొక్కుబడి సమాధానాలు చెప్తూ కాలం వెల్లబుచ్చడం, నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను హెచ్చరించారు. సోమవారం స్పందన భవనంలో మీకోసం గ్రీవెన్స్ నిర్వహించి జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి అర్జీలు స్వీకరించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజు మీకోసం వెబ్‌సైట్‌ను పరిశీలించి అర్జీలు పెండింగ్ లేకుండా సకాలంలో పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో అర్జీదారులు సంతృప్తి చెందేలా పనిచేయాలన్నారు. రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు స్థానికంగా పరిష్కారం కానివి అయితే ఉన్నతాధికారులకు నివేదించి ఏ స్థాయిలో ఫైల్ ఉందో కూడా అర్జీదారులకు తెలపాలన్నారు. బాధ్యత లేకుండా అర్జీదారులకు మొక్కుబడి సమాధానం చెప్తూ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దీనిలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఝాన్సీ లక్ష్మి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. గ్రీవెన్స్ జరిగే సమయంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు అవసరమైన ఒక వీల్‌చైర్, రెండు శ్రవణ యంత్రాలను అందజేశారు. ఒంగోలు చెందిన షేక్ రఫీక్‌కు వీల్‌చైర్, మర్రిపూడి మండలానికి చెందిన పద్మనాభం సురేష్, బల్లికురవకు చెందిన ముత్తూరు శ్రీనులకు శ్రవణ యంత్రాలు కావాలని గ్రీవెన్స్‌లో కోరగా దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ అర్చనకు వెంటనే వీల్‌చైర్, వినికిడి యంత్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో వెంటనే వారికి అవసరమైన వాటిని అందజేశారు. దీనిలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు ఇతర అధికారులు ఉన్నారు.



గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



వికలాంగుడికి వీల్ చైర్ అందచేస్తున్న కలెక్టర్

క్లుప్తంగా

బుర్రా లక్ష్మమ్మకు నివాళి



బుర్రా లక్ష్మమ్మకు నివాళులర్పిస్తున్న మంత్రి పార్థసారధి, మాజీ మంత్రి సురేష్

టంగుటూరు: మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాతృమూర్తి బుర్రా లక్ష్మమ్మ కొన్ని రోజుల క్రితం వృద్ధాప్య సమస్యలతో కన్నుమూశారు. టంగుటూరు మండలం శివపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన పెద్ద కార్యానికి రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్, రాచగర్ల పిచ్చయ యాదవ్, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పోతుల సునీత, బొట్ల సుబ్బారావు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు, బొట్ల సుబ్బారావు, మద్దులూరి శివాజీ, వెన్నా హనుమారెడ్డి, కందుకూరు, కొండపి నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు బుర్రా లక్ష్మమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

పొదుపే జీవన మంత్రం

- ఆదా చేస్తేనే బంగారు భవిష్యత్
- లేదంటే జీవన గమనం ఛిద్రం
- ప్రభుత్వ సంస్థల్లో దాచుకోవడమే సురక్షితం
- అధిక వడ్డీకి ఆశ పడి ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తే కోలుకోలేని దెబ్బ

ఒంగోలు సెంట్రల్: రూపాయి.. రూపాయి కూడబెడితే పది రూపాయలు.. అలా క్రమం తప్పకుండా పోగు చేయగలిగితే భవిష్యత్‌లో అవే సమృద్ధి నిల్వలుగా మారతాయి. కానీ త్వరగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో చాలా మంది.. కేటుగాళ్ల ఉచ్చులో చిక్కుకుని ఉన్నదంతా వదిలించుకుని రోడ్డున పడతారు. అందుకే పొదుపు అనేది ప్రభుత్వ రంగ సంస్థల్లో చేయడమే ఉత్తమం.

పొదుపు చేయడానికి అనేక మార్గాలున్నాయి. అయితే ప్రభుత్వ సంస్థలే దీనికి రక్షణ కవచంగా నిలబడతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రైవేటు సంస్థలు అధిక వడ్డీలు ఆశ చూపి ఎంతోమంది పొదుపుదారులను నిలువునా మోసం చేస్తున్న ఘటనలు జరుగుతూనే ఉంటాయి. అందుకే ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఘరానా మోసాలు

కొంత మంది ప్రయివేట్ వ్యక్తులకు అప్పులు ఇవ్వటం, ప్రవేట్ కంపెనీల్లో పొదుపు చేయడం చూస్తూనే ఉంటాం. మరి కొంత మంది చిట్టీలు వేస్తారు. కానీ అలాంటి వారికి అప్పులు ఇచ్చి రాబట్టుకోలేక కోర్టులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఉంటారు. జిల్లాలో అనేక మంది ప్రయివేట్ ఫైనాన్స్ సంస్థలు, చిట్టీలు వేసే ప్రభుత్వ ఉద్యోగులు సైతం బోర్డులు తిప్పేయటంతో ఎన్నో కుటుంబాలు వీధిన పడ్డాయి. అందుకే సొమ్మును ప్రభుత్వ సంస్థల్లో దాచుకోవడమే మేలని నిపుణులు పేర్కొంటున్నారు.



తూర్పుగంగవరం యూనియన్ బ్యాంకు వద్ద విచారిస్తున్న ఖాతాదారులు

ఎఫ్‌డీలు



ఖాతాదారులు సౌకర్యార్థం వివిధ బ్యాంకులు ట్యాక్స్ సేవింగ్ డిపాడిట్లను అందుబాటులోనికి తీసుకొచ్చాయి. ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు, ఏపీజీబీ, కెనరా బ్యాంకు వంటి వాటితో పాటు పోస్టాఫీసుల్లో ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా ఫిక్స్‌డ్ డిపాడిట్ సౌకర్యం సమకూర్చుతున్నాయి. ఫిక్స్‌డ్ డిపాజిట్లలో రెండు రకాలు ఉన్నాయి. టర్మ్ డిపాడిట్, స్పెషల్ డిపాజిట్.. టర్మ్ డిపాజిట్‌పై వడ్డీ ప్రతి ఆరు నెలలకు ఒక సారి జమ అవుతుంది. స్పెషల్ డిపాడిట్.. టర్మ్ డిపాజిట్‌లపై వచ్చే వడ్డీ అదే డిపాజిట్‌లోని ఖాతాకు జమ అవుతుంది. అందువల్ల ఖాతాదారుడికి వడ్డీ మీద వడ్డీ వస్తుంది.

సీనియర్ సిటిజన్స్‌కు ఎక్కువ వడ్డీ



కొంత మొత్తం నిర్ణీత కాలానికి పొదుపు చేస్తే అలాంటి డిపాజిట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్లు అంటారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ సొమ్మును బ్యాంకుల్లో ఏడు రోజుల నుంచి గరిష్ఠంగా పది సంవత్సరాల వరకు దాచుకునే వీలుంది. కాలం, జమ చేసిన మొత్తం బ్యాంకులకు వడ్డీ శాతం కాస్త ఎక్కువ చెల్లిస్తారు. సీనియర్ సిటిజన్స్‌కు వడ్డీ ఎక్కువ ఇస్తారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లను పిల్లల పేరుపై కూడా.. ఐదేళ్ల అంత కంటే ఎక్కువ చేసుకునే వీలుంది.

రికరింగ్ డిపాజిట్లు



బ్యాంకులు, పోస్టాఫీసుల్లో రికరింగ్ డిపాజిట్లు (ఆర్‌డీ) అకౌంట్‌లను ఏర్పాటు చేసుకునే వీలుంది. నెల నెలా కొంత మొత్తం పొదుపు చేసుకుని దానిపై వడ్డీ పొందవచ్చు. నెలకు నిర్దిష్టంగా కొంత సొమ్మును నిర్ణీత కాలం వరకు జమ చేసుకోవాల్సి ఉంటుంది. కాల పరిమితి ముగిసిన తర్వాత ఆర్‌డీ సొమ్మును వడ్డీతో సహా బ్యాంక్‌లు ఖాతాదారులకు చెల్లిస్తాయి. కనీసం రూ. 100 నుంచి ఆర్‌డీ పొదుపు చేసుకునే వీలుంది. పదేళ్ల వరకు ఆర్‌డీలు చేసుకోవచ్చు. సీనియర్ సిటిజన్స్‌కు కొంత అదనపు వడ్డీ అభిస్తుంది.

దీర్ఘకాలిక ప్రయోజనాకు ఉపయోగం



అవసరాలకు డబ్బుకావాలను కునే వారు వడ్డీ కోసం ఆశ పడకుండా ప్రభుత్వ సంస్థల్లో పొదుపు చేసుకోవాలి. యూనియన్ బ్యాంకులో ఆర్‌డీ సదుపాయం ఉంది. 6.5 నుంచి 7 శాతం వడ్డీ ఇస్తున్నాం. ఫిక్స్‌డ్ డిపాడిట్‌లకు ఒక సంవత్సం పాటు 6.75 లెక్కన, 399 రోజులకు 7.25 శాతం వడ్డీతో చెల్లిస్తున్నాం.

సి. మల్లిఖార్జున రావు, యూనియన్ బ్యాంక్ మేనేజర్, తూర్పుగంగవరం

7.50 వడ్డీ రేటుతో ప్రత్యేక డిపాడిట్ పథకం



ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రగతి కుబేర్ పేరుతో 444 రోజులకు రూ.7.50 వడ్డీతో ప్రత్యేక డిపాడిట్ పథకం వచ్చింది. జనర్ పబ్లిక్ ఉమెన్ అయితే 7.55 వడ్డీ, సీనియర్ సిటిజన్స్ అయితే 8.00 శాతం, సీనియర్ సిటిజన్స్ ఉమెన్ అయితే 8.05 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్స్‌కు 8.25 శాతం, అందులో మహిళలకు అయితే 8.30 శాతం వడ్డీతో ఇస్తున్నాం. మిగిలిన బ్యాంకులతో పోలిస్తే ఏపీజీబీలో కస్టమర్స్‌కు ఇచ్చే వడ్డీ రేటు కొంత ఎక్కువ ఉంటుంది.

మహేష్ రెడ్డి, మేనేజర్, ఏపీజీబీ, తూర్పుగంగవరం



రోడ్డుపై ధర్నా చేస్తున్న వీధి వ్యాపారులు



మున్సిపల్, ఆర్డీఓ కార్యాలయం వద్ద వీధి వ్యాపారుల నిరసన

కనిగిరిలో ఉద్రిక్తత

- బంకుల తొలగింపును అడ్డుకున్న వీధివ్యాపారులు
- కమిషనర్ ఏకపక్ష వైఖరిని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయింపు
- తాత్కాలికంగా ఆగిన తొలగింపు చర్యలు

కనిగిరి రూరల్: కనిగిరిలో 'అధికార' జులుంపై వీధి వ్యాపారులు తిరగబడ్డారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం అంటూ మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు అత్యుత్సాహంతో నోటీసులు ఇవ్వకుండా, ప్రత్యామ్న ఏర్పాటు చూపకుండా ఫుట్ పాత్‌లపై బతికే తమపై 'అధికార' ప్రతాపం చూపడాన్ని ఖండించారు. ఒక్కసారిగా తెల్లవారు జామున విద్యుత్ సరఫరాలను ఆపి, బంకులు తొలగించేందుకు వచ్చిన అధికార యంత్రాంగంపై స్థానిక చెప్పుల బజార్, పామూరు బస్టాండ్‌లోని సుమారు 300 మంది వీధి వ్యాపారులు తిరగబడ్డారు. పొక్లెయిన్లు కదలకుండా ప్రతి ఘటించారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం సీఐటీయూ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. కమిషనర్ ఏకపక్ష వైఖరిపై తీవ్రంగా మండిపడ్డారు. దీంతో అధికారులు తాత్కలికంగా తొలగింపు చర్యలను ఆపారు. ఈ ఉదంతం కనిగిరిలో సోమవారం జరిగింది.

ప్రత్యామ్నయం చూపిన తర్వాతే బంకులను తొలగించాలి

సుమారు 40 ఏళ్ల నుంచి చెప్పుల బజార్, పామూరు బస్టాండ్‌లలో ఫుట్ పాత్‌ల పక్కన బంకులు పెట్టుకుని జీవిస్తున్న వీధి వ్యాపారులకు కనీస ప్రత్యామ్నయం చూపకుండా బంకులు తొలగించడాన్ని సీఐటీయూ జిల్లా నాయకులు పీసీ కేశవరావు ఖండించారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వీధివ్యాపారులు తమ బంకులను తొలగించ వద్దని ఆందోళన చేశారు. వీధి వ్యాపారులు మున్సిపాలిటీకి ఆక్రమిత పన్నులు చెల్లిస్తున్నారని.. నిబంధనల ప్రకారం కనీసం నోటీసులు ఇవ్వాల్సిన బాధ్యత మున్సిపల్ కమిషనర్‌కు ఉందన్నారు. అధికార పార్టీ నేతల ఆదేశాల మేరకే కమిషనర్ నిబంధనలను తొంగలో తొక్కి ఇష్టాను రీతిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మున్సిపాలిటీలో రోడ్ల ఆధునికీకరణ, కాలువల విస్తరణ, సైడు కాలువల పరిశుభ్రతకు నిధులే మంజూరు కాకుంటే .. బంకులను ఖాళీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. దర్శి తరహాలో వీధివ్యాపారులకు ప్రత్యామ్నం చూపించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జీవీ కొండారెడ్డి కలెక్టర్‌కు వినతి పత్రం అందించినట్లు తెలిపారు.

అనంతరం స్థానిక పామూరు బస్టాండ్‌లో ధర్నా చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవ ద్దని సీఐ దాసరి వెంకటేశ్వరరావు చెప్పడంతో ఆర్డీఓ కార్యాలయం వద్ద, మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఆర్డీఓ పి. జాన్ ఇర్విన్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, వీధి వ్యాపార సంఘం నాయకులు ఎస్‌కే బషీరా, ప్రసన్న, ఏడుకొండలు, పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.





బంకుల తొలగింపును అడ్డుకుంటున్న వీధివ్యాపారులు, సీఐటీయూ నాయకులు

సత్వర న్యాయం అందించడమే లక్ష్యం

- జిల్లా అడిషనల్ ఎస్పీ నాగేశ్వర రావు



ఫిర్యాది దారులతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ నాగేశ్వర రావు

ఒంగోలు సెంట్రల్: ఎస్పీ ఆదేశాలతో ప్రజా ఫిర్యాదులపై తక్షణ చర్యలతో సత్వర న్యాయం అందించటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జిల్లా అడిషనల్ ఎస్పీ కె. నాగేశ్వర రావు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లాలో పలు ప్రాంతాలకు చెందినవారు వచ్చి ఫిర్యాదులు చేశారు. ఆయన ఫిర్యాదు దారులతో మాట్లాడి చట్ట ప్రకారం విచారణ జరిపి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈమేరకు సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఒంగోలు డీఎస్పీ కిషోర్ బాబు, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర రావు, ఎస్సై రజియా తదితరులు పాల్గొన్నారు. సోమవారం 55 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.

పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి డోలా



పింఛన్‌లు పంపిణీ చేస్తున్న మంత్రి డోలా



పింఛన్ల పంపిణీ తనిఖీ చేస్తున్న కలెక్టర్

దర్శి: మండలంలోని రాజంపల్లి గ్రామంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం పింఛనన్లు పంపిణీ చేశారు. పింఛన్ దారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దర్శి పట్టణంలో పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ తమీమ్ అన్సానియా ఆకస్మిక తనిఖీ చేశారు. లబ్ధిదారులకు నిర్ణీతకాలంలో పింఛన్ అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, కమిషనర్ మహేష్, ఎంపీడీఓ హనుమంత రావు, ఈఓఆర్డీ శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ఒంగోలు: ఏపీ ఓపెన్ స్కూల్ నిర్వహించిన సప్లిమెంటరీ ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్ష ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. ఎస్ఎస్‌సీ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 854 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 577 మంది (67.56శాతం)తో ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ మీడియెట్‌లో 2561 మందికి గాను 2021 మంది (78.91శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాలకు సంబంధించి రీకౌంటింగ్ కోరేవారు సబ్జెక్టుకు రూ. 200, రీవెరిఫికేషన్‌కు అయితే సబ్జెక్టుకు వెయ్యిరూపాయల చొప్పున ఈనెల 13లోగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. చెల్లింపులు ఏపీ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ ద్వారా లేదా పేమెంట్ గేట్‌వే ద్వారా చెల్లించాలన్నారు. మార్కుల వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఓపెన్‌స్కూల్.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా పరిశీలించుకోవచ్చన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మేయర్ గంగాడ సుజాత



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సెంట్రల్: కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఒంగోలు మేయర్ గంగాడ సుజాత సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. పలు సమస్యలపై చర్చించారు.

ఉరితాడుగా మారిన విద్యుత్ తీగలు



గొర్రెల ఎరువు లోడు చేసిన లారీ



మృతి చెందిన యువకుడు తిప్పస్వామి కుశ

- విద్యుదాఘాతంతో కర్ణాటకవాసి మృతి



తిప్పస్వామి కుశ (ఫైల్)

హనుమంతునిపాడు: మండల పరిధి వేములపాడులో సోమవారం వేకువ జామున విద్యుత్ తీగలు తగలి లారీ క్లీనర్ దుర్మరణం చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గ జిల్లా, ఇంగదాలు మండలం, యరహెళ్ల గ్రామానికి చెందిన తిప్పస్వామి కుశ (24)తో పాటు చిత్ర దుర్గజిల్లాకు చెందిన పలువురు మండల పరిధి వేములపాడులో గొర్రెల ఎరువు కొనుగోలు చేశారు. ఎరువును లారీకి లోడు చేశారు. తెల్లవారు జామున వర్షం కురుస్తుండటంతో ఎరువు తడవకుండా ఉండేందుకు లారీ క్లీనర్ తిప్పస్వామి కుశ.. పట్టలు కప్పుతున్నాడు. ఆ సమయంలో చీకటిగా ఉండటంతో పైనున్న విద్యుత్ మెయిన్ లైను అతను గమనించక పోవడంతో తీగలు మెడకు తగిలి అక్రడికక్కడే మృ తి చెందాడు. లారీ డ్రైవర్ అంజనప్ప గోపాలు పైకి ఎక్కి చూడగా కుప్పకూలి పడి ఉన్నాడు. మృతుని తండ్రి తిప్పస్వామికి ఇద్దరు కుమారులు కాగా కుశ.. రెండో కుమారుడు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కేసు నమోదు చేసి విచారిస్తామని ఎస్సై కె.శివనాగరాజు తెలిపారు.

కుమారుడి నుంచి కాపాడండి సారూ..

- వృద్ధ తల్లిదండ్రుల వేడుకోలు
- పురుగులమందు డబ్బాతో ఎస్పీ కార్యాలయం వద్ద నిరసన



పురుగుల మందు చూపుతూ, ఆవేదన వ్యక్తం చేస్తున్న పెద పకీరయ్య, సుబ్బమ్మ దంపతులు

ఒంగోలు సెంట్రల్: నవమాసాలు మోసి పెంచి, పెద్దచేసి ఆస్తులు పంచి ఇచ్చినా..తమను వృద్ధాప్యంలో కుమారుడు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని తమను ఆర్థికంగా ఆదుకుని, రక్షణ కల్పించకపోతే చావే శరణ్యమంటూ పురుగులమందు డబ్బా చేతబట్టుకుని ఓ వృద్ధ జంట ఎస్పీని వేడుకున్నారు. బాధితుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం రంగాపురానికి చెందిన కిల్లే పెదపకీరయ్య, ఆయన భార్య సుబ్బమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. అందులో చిన్న కుమారుడు కిల్లే కాశీశ్వరుడు మిలిటరీలో పనిచేసి రిటైర్డ్ అయి పొలం కొనుక్కొని భార్య, పిల్లలతో, తల్లిదండ్రులతో రంగాపురంలో ఉంటున్నాడు. పెద్ద కుమారుడు మల్లికార్జునరావు, చిన్న కుమారుడు కాశీశ్వరుడికి ఆస్తి పంపకాల విషయంలో వివాదాలు వచ్చాయి. దీంతో చిన్న కుమారుడు ఇటీవల తమను కొట్టి సామాను కూడా తీసుకోనివ్వకుండా ఇంటి నుంచి బయటకు పంపి ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడుతున్నారని తల్లిదండ్రులు వాపోయారు. ఇంటి బయట అరుగుమీద పరదాలు కట్టుకుని ఉన్నాసరే ఒప్పుకోవడం లేదని, మంచినీళ్లు సైతం పట్టుకోనివ్వడం లేదని వాపోయారు. చిన్నకుమారుడు పొలం కొనడానికి తాను ఇద్దరి వద్ద నగదు అప్పు తీసుకున్నానని, బ్యాంకులో సైతం దాదాపు రూ.16 లక్షలు అప్పు తెచ్చి పెట్టానని తండ్రి పెదపకీరయ్య తెలిపాడు. ఆ అప్పును తాను చెల్లించనని చిన్న కుమారుడు చెప్పడంతో.. అప్పుల వాళ్లు తనపై ఒత్తిడి తెస్తున్నారని వాపోయాడు. ఆ అప్పు చెల్లించకపోతే తమకు మరణమే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం నీళ్లు అడిగినా తమను తిడుతూ కొట్టడానికి వస్తున్నారని..వారి నుంచి ప్రాణహాని ఉందని తమకు రక్షించాలని ఎస్పీ సుమిత్ సునీల్‌కు విన్నవించారు.

వృద్ధురాలి దారుణ హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ బాలసుందరరావు, సీఐ, ఎస్సై



మృతిచెందిన కన్నెసాని నారాయణమ్మ

- అల్లుడే హతమార్చి ఉంటాడని పోలీసులు అనుమానం
- నిందితుని కోసం గాలింపు

మార్కాపురం రూరల్: ఓ వృద్ధురాలు దారుణ హత్యకు గురైంది. ఈ ఘటన మార్కాపురం మండలం వేములకోటలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మార్కాపురం రూరల్ ఎస్సై వెంకటేశ్వర నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. కన్నెసాని నారాయణమ్మ (65) తన కూతురు సునీతని రేళ్ల శ్రీనుకు ఇచ్చి వివాహం చేసింది. కొంతకాలం సజావుగా జరిగిన వీరి కాపురంలో అనుమానం పెను భూతమైంది. భర్త రేళ్ల శ్రీను భార్యను అనుమానంతో వేధిస్తూ చివరికి గత ఏడాది దారుణంగా హతమార్చాడు. ఈ కేసులో జైలుకెళ్లిన అతను బెయిల్‌పై బయటకు వచ్చి తిరుగుతున్నాడు. ఈ క్రమంలో తన అత్త నారాయణమ్మే అతను జైలుకు పోవడానికి కారణం అని అక్కసు పెంచుకున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఆమె గొంతు దగ్గర తీవ్ర గాయాలై రక్తపు మడుగులో పడి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని విచారించారు. అల్లుడు శ్రీను పరారు కావడంతో అతనే హత్య చేసి ఉంటాడని ఓ అంచనాకు వచ్చారు. పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉంది. ఘటనా స్థలాన్ని డీఎస్పీ బాలసుందరరావు, సీఐ ఆవుల వెంకటేశ్వర్లు పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్కాపురం జీజీహెచ్‌కు తరలించారు.